క్లుప్తంగా

పీజీఆర్ఎస్ సమస్యలు పరిష్కరించండి



సమస్యలు తెలుసుకుంటున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం

సి.బెళగల్: మండల ప్రజల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదికకు (పీజీఆర్ఎస్‌కు) వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్వోలతో కలిసి పీజీఆర్ఎస్ నిర్వహించారు. కార్యక్రమంలో కొండాపురం, పోలకల్, సి.బెళగల్, బురాన్‌దొడ్డి తదితర గ్రామాల నుంచి రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని అర్జీలు అందజేశారు. అనంతరం ఆయన.. సమస్యలపై వీఆర్వోలతో చర్చించి, వీలైనంత త్వరగా పరిష్కరించాలని పలు సూచనలు చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి, వీఆర్వోలు పాల్గొన్నారు.

లోఓల్టేజీతో ఇబ్బందులు

పాణ్యం: మండల పరిధిలోని గాలేరు – నగరి కాల్వ సమీపంలో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఓల్టేజీతో ఇబ్బందులు పడుతున్నామని, దీనిపై పలుమార్లు అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. ఖరీఫ్ ప్రారంభమైన తరుణంలో వరి నార్లు సాగు చేసుకోవాలని, అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి మరమ్మతులు చేయాలని కోరతున్నా పలకడం లేదని రైతులు వాపోతున్నారు. గత 20 రోజుల నుంచి విద్యుత్ లో ఓల్టేజీ సమస్య ఉందని వివరించారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ కింద మూడు వ్యవసాయ బోర్లు ఉన్నాయని, ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఏఈ మధుసూదన్‌యాదవ్‌ను వివరణ కోరగా సమస్యను పరిష్కరించి రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.

డిజిటల్ టెక్నాలజీ వైపు అడుగులు



కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

కోడుమూరు రూరల్ : విజన్ 2047 కార్యక్రమంలో భాగంగా డిజిటల్ టెక్నాలజీ వైపు రాష్ట్రం అడుగులు వేస్తుందని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి తెలిపారు. సోమవారం కోడుమూరులో ఆర్డీఓ సందీప్ కుమార్‌తో కలిసి నియోజకవర్గ అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ రూపొందించి యూనిట్ ఆఫీస్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. తహసీల్దార్ వెంకటేష్ నాయక్, ఎంపీడీఓ రాముడు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లైఫ్ స్కిల్స్‌తో సామాజిక వ్యక్తిత్వ వికాసం



సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

కర్నూలు కల్చరల్: సామాజిక, వ్యక్తిత్వ అభివృద్ధికి లైఫ్ స్కిల్స్ ఉపయోగపడతాయని డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ టెక్నాలజీ, నైస్ స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన లైఫ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ కోర్సులలో శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా రాయపాటి మాట్లాడుతూ.. ఆధునిక కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు టైం మేనేజ్‌మెంట్, టీం వర్క్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు కేడీజే బాబు మాట్లాడుతూ.. విద్యతో పాటు జీవన నైపుణ్యాలపై శిక్షణ తీసుకున్న వారు ఉద్యోగ సాధనలో విజయం సాధించగలుగుతారన్నారు. నైస్ సంస్థ, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి నిధులు కేటాయించాలి

కల్లూరు: ముస్లిం శ్మశాన వాటిక కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కల్లూరు అర్బన్‌లోని 26 నుంచి 35 వార్డులకు చెందిన ముస్లిం మతపెద్దలు సోమవారం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముస్లిం మతపెద్దలు షేర్ ఖాన్, షకూర్, బాషా, మైనార్టీ నాయకులు ఫిరోజ్, ఖాజామియా, సులేమాన్ తదితరులు ఉన్నారు.

అన్నదాత.. కాస్త జాగ్రత్త

- అప్రమత్తత లేకుంటే అంతే..
- వర్షాకాలం విద్యుత్ పెట్టెల వద్ద అప్రమత్తత అవసరం
- నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణానికే ముప్పు
- చిన్నపాటి జాగ్రత్తలతో ప్రమాదాలకు అడ్డుకట్ట





వ్యవసాయం పొలంలో ఏర్పాటు చేసిన విద్యుత్ పెట్టె, చిందుకూరులో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఎద్దు (ఫైల్)

గడివేముల: దేశానికి అన్నం పెట్టే అన్నదాతలు పంటల సాగులో భాగంగా పొలాలకు నీరు పెట్టడానికి వెళ్తూ పొరపాటున విద్యుత్ ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారు. మరికొందరు స్వయంగా మరమ్మతులు చేసేందుకు ప్రయత్నించి ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే పొలాల్లో తెగిపడిన విద్యుత్ తీగలు, కిందకు వేలాడుతున్న తీగల వల్ల కూడా ప్రమాదాలు జరుగుతుంటాయి. వర్షాకాలంలో రైతులకు విద్యుత్ ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇళ్ల వద్ద, పంట పొలాల్లో విద్యుత్ వినియోగంలో తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఖరీఫ్ సీజన్‌లో విద్యుత్, బోరుబావులు, వాగుల వద్ద మోటార్లు ఏర్పాటు చేసి పంటలు సాగు చేస్తారు. విద్యుత్ వినియోగంలో ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. వర్షాకాలంలో ఈదురు గాలులు ఎక్కువగా వీస్తుంటాయి. అలాంటి సమయంలో జీవాలను మేత కోసం తీసుకెళ్లేవారు మరింత అప్రమత్తంగా ఉండాలని నిపుణలు సూచిస్తున్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు అప్రమత్తతతో పాటు అవగాహన, తగిన జాగ్రత్తలు పాటిస్తే మంచిదని గడివేముల విద్యుత్‌శాఖ ఏఈ ఖలీల్ పాషా రైతులకు తెలియజేస్తున్నారు.

మూడింటికే పరిహారం..

విద్యుత్ సంస్థలు కేవలం మూడు రకాల ప్రమాదాలకు మాత్రమే నష్టపరిహారం అందిస్తాయి. మనుషులు, పశువులు మరణిస్తే సాయం అందుతుంది. గాయాలకు పరిహారం ఉండదు. మనుషులకు అయితే రూ.5 లక్షలు, పశువులకైతే రూ.40 వేలు, మేకలు, గొర్రెలకు రూ.7 వేల చొప్పున నష్ట పరిహారం చెల్లిస్తారు. ప్రమాదం జరిగిన స్థలంలోని చిత్రం, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు, శవ పంచనామా పత్రాలను విద్యుత్ అధికారులకు సమర్పించాలి. పశువులకైతే ఫొటోతో పాటు పశు వైద్యుడి పోస్టుమార్టం నివేదికను విద్యుత్ అధికారులకు అందించాల్సి ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- విద్యుత్ పనులు సొంతంగా చేసుకోరాదు.
- తడిచేతితో విద్యుత్ పరికరాలు ముట్టుకోకూడదు.
- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు పోతే కరెంటు ఉండదని మరమ్మతులు చేయకూడదు.
- మోటార్లను నేలపై కాకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గద్దెలపై ఏర్పాటు చేయాలి. స్టార్టర్ బోర్డును తడవకుండా చూడాలి.
- మోటారు పాడైతే మెకానిక్‌తోనే మరమ్మతులు చేయించాలి. సొంతగా ప్రయత్నించవద్దు.
- స్టార్టర్ వైర్లు నేల మీద ఉంచకూడదు. స్టార్టర్‌పై మూత తీసి వాడకూడదు.
- సర్వీసు వైర్లు, మోటార్లకు వాడే తీగలు నాణ్యమైనవి వాడాలి. అతుకులు లేకుండా చూసుకోవాలి.
- సబ్ మెర్సిబుల్ మోటారుతో పాటు విద్యుత్ వైర్ ఉంటుంది. ఏ కొంచం వైర్లు తెగి ఉన్నా, మోటార్ నుంచి పైన ఉండే వస్తువులకు విద్యుత్ సరఫరా జరిగే అవకాశం ఉంటుంది.
- ఎవరైనా విద్యుత్ షాక్‌కు గురైతే వెంటనే స్విచ్ ఆఫ్ చేసి పొడవైన ప్లాస్టిక్ పైపు, కర్రతో వ్యక్తిని తప్పించాలి. తగిన వైద్య సహాయం అందించాలి.

నష్టపరిహారం ఇలా..

- ఆకస్మాత్తుగా విద్యుత్ తీగలు తెగి కింద పడినప్పుడు అవి తగిలి మనుషులు, పశువులు మరణిస్తే నష్టపరిహారం ఇస్తారు.
- ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉన్నప్పుడు వాటికి తగిలి చనిపోతే నష్టపరిహారం అందుతుంది.
- తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు తగిలి మృత్యువాత పడితే నష్ట పరిహారం ఇస్తారు.

ప్రమాదాలు ఇలా..

వర్షకాలంలో ఈదురు గాలులతో విద్యుత్ తీగలు తెగిపోవడం, స్తంభాలు విరిగిపోయి కరెంటు సరఫరా అవుతుండడంతో పశువులు, ప్రజలు షాక్‌తో మృతి చెందుతున్నారు. రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లినప్పుడు అక్కడ సరైన వైరింగ్ లేక ఏమరుపాటుతో ప్రమాదాల బారిన పడుతున్నారు. డిస్ట్రిబ్యూషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనుమతి లేకుండా ఫ్యూజులు మార్చే సందర్భంలో కరెంటు సరఫరా కావడంతో పలువురు చనిపోయిన ఘటనలూ ఉన్నాయి. సర్వీస్ వైర్లు, వీధి దీపాలను సరిచేసేందుకు విద్యుత్ స్తంభాలు ఎక్కినప్పుడు కరెంటు సరఫరా జరిగి మృతి చెందిన సందర్భాలు ఉన్నాయి.

జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రతి ఒక్కరూ విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి. పొలాలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలి. ప్రమాదాల బారిన పడకుండా రైతులు విద్యుత్ శాఖాధికారులు చెబుతున్న జాగ్రత్తలు తీసుకోవాలి. తీగలు తెగిపడినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. అలాంటి వాటిపై విద్యుత్ అధికారులకు వెంటనే సమాచారం అందించాలి. అన్నదాతలు సర్టిఫైడ్ ఎలక్ట్రీషియన్లతోనే విద్యుత్ పనులు చేయించుకోవాలి. ఆన్, ఆఫ్ స్విచ్‌లు వేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలి.

– ఖలీల్ పాషా, విద్యుత్ శాఖ ఏఈ, గడివేముల

కోడుమూరులో 34.8మి.మీ వర్షపాతం

కోడుమూరు రూరల్: పట్టణంలో 34.8మి.మీ వర్షపాతం నమోదైంది. ఆదివారం రాత్రి ఏకధాటిగా గంటకుపైగా భారీ వర్షం కురవడంతో పట్టణంలోని మెయిన్ బజార్, తేరుబజార్, మునిమంద ప్రాంతాల్లో మోకాటిలోతుకు పైగా వర్షం నీరు ప్రవహించింది.

మాతృమరణాల నివారణకు చర్యలు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ప్రసవ సమయంలో మాతృ మరణాలు తగ్గించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ చెప్పారు. ఆమె సోమవారం తన చాంబర్‌లో మాతృ మరణాలపై సమీక్ష నిర్వహించారు. పెద్దహరివాణం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గత ఏప్రిల్‌లో సంభవించిన మాతృమరణంపై ఆమె సమీక్షించారు. క్షేత్రస్థాయిలోని సిబ్బంది, ఆశా, ఆరోగ్య కార్యకర్త, వైద్యాధికారులు గర్భవతులను త్వరగా గుర్తించి వారికి సరైన సమయంలో సమయానుసార వైద్యసేవలు అందించినట్లయితే తల్లుల మరణాల శాతం తగ్గించవచ్చని చెప్పారు. ఒకవేళ ఆ గర్భవతులను హైరిస్క్‌గా గుర్తించినట్లయితే ఆశా, ఆరోగ్య కార్యకర్త, పర్యవేక్షకులతో ట్రాక్ చేసి సమీప సామాజిక ఆరోగ్య కేంద్రం, ఏరియా ఆసుపత్రులు, ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స అందించినట్లయితే మాతాశిశు మరణాలు తగ్గించవచ్చని చెప్పారు. డిస్ట్రిక్ట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ నాగప్రసాద్‌బాబు, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు, గైనకాలజీ హెచ్ఓడీ డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్లు పద్మజ, సుధీర్‌కుమార్, శ్రీనివాసులు, రంగస్వామి, డీపీహెచ్ఎన్ఓ అన్నపూర్ణ, పీహెచ్‌సీ వైద్యాధికారులు అభిరూప్, ఇర్ఫాన్‌బాషా, పీహెచ్ఎన్ మీనాక్షి, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

పిల్లలతో పనిచేయిస్తే కఠిన చర్యలు



గడివేములలో దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్న కార్మికశాఖ సిబ్బంది

గడివేముల: దుకాణాల్లో, మెకానిక్ షాపుల్లో చిన్న పిల్లలతో పనిచేయిస్తే కఠిన చర్యలు తప్పవని కార్మిక సహాయ అధికారి సారమార్గెట్ హెచ్చరించారు. బాలకార్మిక నిర్మూలన వారోత్సవాలలో భాగంగా సోమవారం గడివేములలో వివిధ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. బాలకార్మికులతో పనులు చేయిస్తున్న యజమానులను హెచ్చరించి, సూచనలు చేశారు. చిన్నపిల్లలతో పనులు చేయిస్తే నేరమని, వారిని బడిలో చేర్పించాలన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 2 నుంచి 30వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పిల్లలతో బలవంతంగా పనులు చేయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామన్నారు. అనంతరం పాతబస్టాండు ప్రాంతంలో దుకాణాల యాజమానులకు పలు సూచనలు చేశారు. ఉప సర్పంచ్ బాలచెన్ని, కార్మిక శాఖ సిబ్బంది మురళీకృష్ణ, ఎన్‌జీఓ సంపత్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

యోగాభ్యాసంతో మానసిక వికాసం



యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న మండలస్థాయి అధికారులు, సిబ్బంది

గడివేముల: భారతీయ వారసత్వ సంపదైన యోగాభ్యాసంతో మానసిక వికాసం, ఆరోగ్య జీవన విధానం సొంతమవుతుందని తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీఓ వాసుదేవ గుప్తా అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి కొత్తబస్టాండు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి రోజూ ఉదయం యోగా చేస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఏఓ హేమసుందర్‌రెడ్డి, మండల సర్వేయర్ మధు, ఏపీఎం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: మండలకేంద్రంలో సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు అధికారులు యోగాంధ్ర ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. బస్టాండ్‌లోని నాలుగు కూడళ్లలో మానవహారంగా ఏర్పడి అవగాహన కల్పించారు. సర్పంచ్ మేకల పల్లవి, ఈఓఆర్డీ చంద్రమౌళేశ్వర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ' అందజేయాలి



తహసీల్దార్ వెంకటేష్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

కోడుమూరు రూరల్: ఎన్నిక సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం వెంటనే అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ.20వేలు అందజేయాలని సీపీఐ మండల కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ, రైతు సంఘం నాయకులు తహసీల్దార్ వెంకటేష్ నాయక్‌కు వినతిప్రతం అందజేశారు. రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఇంతవరకు పథకాన్ని అమలు చేయకుండా మోసం చేస్తోందని విమర్శించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నా రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేలేకపోయిందని మండిపడ్డారు. అలాగే..రైతులకు అవసరమైన పంట రుణాలను అందజేయాలని కోరారు. రాముడు, మద్దిలేటి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రంగస్వామి, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయండి

పాణ్యం: నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని ఎమ్మెల్యే గౌరు చరిత సూచించారు. ఆమె సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సీవీపీయూపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఉన్న వనరులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి సంవత్సరం 15 శా తం వృద్ధి రేటు సాధించాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. నియోజకవర్గంలో వ్యవసాయం, పరిశ్రమలు, ప్రభుత్వ సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి పౌరుడికి మౌలిక సదుపాయాలు అందేలా, గ్రామాలు అభివృద్ధి చెందేలా అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ ప్రణాళికకు సంబంధించి ఒక టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలోనే ప్రణాళిక ప్రచురించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం పురోగతిపై చర్చించారు. స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ సీఈఓ సు బ్బారెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డితో పాటు మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నదిలో మునిగి వ్యక్తి మృతి

కర్నూలు: తాగిన మత్తులో బహిర్భూమికి వెళ్లి తుంగభద్ర నీటిలో మునిగి సాయిబాబా సంజీవయ్య నగర్‌కు చెందిన జగ్గుల రాముడు (44) మృతి చెందాడు. ఈయన మున్సిపల్ కార్పొరేషన్‌లో ఔట్ సోర్సింగ్ కింద స్వీపర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం బహిర్భూమికి వెళ్లిన రాముడు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు నీటిలో గాలించగా మృతదేహం బయటపడింది. తాగిన మైకంలో నీటిలో మునిగిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయనకు భార్య కృష్ణవేణి, నలుగురు పిల్లలు సంతానం. ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

అత్యాచారాలను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం

కర్నూలు(అర్బన్): మహిళలు, చిన్నారులు, విద్యార్థులపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి తీవ్రంగా ఆరోపించారు. ఆమె సోమవారం స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ.. సత్యసాయి జిల్లాలో దళిత మైనర్ బాలికపై జరిగిన సామూహిక అత్యాచార సంఘటన మరువక ముందే, అనంతపురం జిల్లాకు చెందిన విద్యార్థినిని హత్య చేసిన నిందితుల్ని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతపురం రామకృష్ణ కాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థినిపై అత్యాచారం, హత్య ఘటన బాధాకరమన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హింసను అరికట్టే చర్యల్లో పోలీస్ యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్నారు. దేశవ్యాప్తంగా అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నా, పాలకులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. అత్యాచారాలు, హత్యలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను ఏర్పాటు చేసి బాధిత మహిళలకు సత్వర న్యాయం అందేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా మూడు నెలల్లో కేసు విచారణ జరిపి నిందితుల్ని చట్ట ప్రకారం శిక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



కర్నూలు: కర్నూలు శివారు జొహరాపురం రోడ్డులో అశ్విని ఆసుపత్రి సమీపంలో ఫుట్‌పాత్‌పై అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. మూడో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 40 ఏళ్లు ఉంటుందని, ఛామన ఛాయ వర్ణం ఉన్నట్లు తెలిపారు. నీలం రంగు చొక్కా, ముదురు నీలం రంగు ప్యాంటు, పింక్ రంగు బనియన్ ధరించి ఉన్నట్లు చెప్పారు. సమాచారం తెలిసినవారు 91211 01061 లేదా 08518-277187 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారమివ్వాలని మూడో పట్టణ పోలీసులు కోరారు.

రైళ్లను పునరుద్ధరించాలి



రైల్వేస్టేషన్ మాస్టర్ యిర్మియాకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

పాణ్యం: కరోనాకు ముందు స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆగే రైళ్లతో పాటు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ మాస్టర్ యిర్మియాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో అనేక రైళ్లు పాణ్యం రైల్వేస్టేషన్‌లో ఆగేవని, అయితే కరోనా తర్వాత రైళ్లను ఆపకుండా చేశారన్నారు. పాణ్యం రైల్వేస్టేషన్ పరిధిలో అనేక పరిశ్రమలు, పర్యాటక రంగ ప్రదేశాలు, ఆలయాలు ఉన్నాయన్నారు. ఈ పరిశ్రమల్లో పనిచేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో కార్మికులు వస్తుంటారన్నారు. కావున పాణ్యం రైల్వేస్టేషన్‌లో బెంగుళూరు కంటోన్మెంట్- విజయవాడ, బెంగుళూరు ప్యాసింజర్‌ను పునరుద్ధరించాలని కోరారు. అలాగే హుబ్లీ-విజయవాడ, విజయవాడ-హుబ్లీ కూడా పాణ్యం స్టేషన్‌లో ఆపాలన్నారు. అలాగే రిజర్వేషన్ కౌంటర్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు రైల్వే సేవలను అందుబాటులోకి తీసుకు రావాలని కోరారు. రైతు సంఘం కన్వీనర్ కొండారెడ్డి, కో-కన్వీనర్ బుజ్జి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు

కల్లూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు సూచించారు. సోమవారం మండల పరిధిలోని ఉలిందకొండ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు మాతా శిశు సంరక్షణ కార్డు గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. మాతా శిశు మరణాలను సమర్థవంతంగా నివారించాలంటే గర్భిణుల వివరాలు, వారికున్న ఆరోగ్య ఇబ్బందులు, ప్రస్తుతం అందిస్తున్న వైద్యం, ముందు తీసుకోవలసిన జాగ్రత్తలను కార్డులో నమోదు చేయాలన్నారు. మొదటి నెల గర్భిణి అయినప్పటి నుంచి 9వ నెల వరకు, ప్రసవం అనంతరం తీసుకోవలసిన జాగ్రత్తలు, అందించిన వైద్యం తదితర వివరాలన్నీ అందులో నమోదు చేయడంతో పాటు, ప్రతి నెలా అవసరమైన వైద్యం అందించాలన్నారు. డాక్టర్ కృష్ణబాయి, ఆరోగ్య విస్తరణ అధికారి విజయకుమార్, వైద్యాధికారులు శ్వేతవాణి, దేవమణి, శోభారాణి, నాగేశ్వరమ్మ, ప్రాజెక్టనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

ఏడుగురికి ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా అవార్డులు అందుకున్న విద్యార్థులు

ఓర్వకల్లు: మండలంలోని వేర్వేరు పాఠశాలలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ప్రతిభా పురస్కారాలను అందుకున్నట్లు ఎంఈఓ-2 ఓంకార్‌యాదవ్ తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను చదువు పట్ల ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ పేరుతో ప్రతిభా అవార్డులకు ఎంపిక చేసింది. మండలంలోని కాల్వబుగ్గ గురుకుల పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు మహ్మద్‌బాషా (587 మార్కులు), ఉదయ్ కుమార్ (586), మధన్ (586), కిరణ్‌కుమార్ (585), సుమంత్ (580), రంజిత్‌నాయక్ (577) మార్కులు సాధించగా, లొద్దిపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ధర్మసాయి (584) మార్కులు సాధించి షైనింగ్ స్టార్ పురస్కారాలకు ఎంపికయ్యారు. వీరందరికి సోమవారం పెద్దపాడు వద్ద గల ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గౌరు చరిత, జాయింట్ కలెక్టర్ నవ్య చేతుల మీదుగా రూ.20 వేల నగదు, మెడల్స్‌తో పాటు, ప్రశంసా పత్రాలు అందజేసినట్లు చెప్పారు.

పొంచి ఉన్న ప్రమాదం



కల్వర్టు వద్ద ప్రమాదపు హెచ్చరిక బోర్డులు లేని దృశ్యం

కోడుమూరు రూరల్: కోడుమూరు నుంచి వెల్దుర్తికి వెళ్లే రోడ్డులో అగ్నిమాపక కేంద్రం వద్ద ఉన్న కల్వర్టుపై వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. కల్వర్టు వద్ద రోడ్డుకిరువైపులా వర్షాలకు రోడ్డు కోతకు గురి కావడంతో పాటు, ఆరడుగులకు పైగా గుంతలేర్పడ్డాయి. దీంతో వాహనదారులు గమనించకుండా వెళ్తే ప్రమాదం చోటు చేసుకునే అవకాశముంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో, వర్షం కురుస్తున్న సమయాల్లో రోడ్డును గమనించకుండా వెళ్తే వాహనాలు వంకలో పడిపోయే ప్రమాదముంది. సంబంధిత అధికారులు స్పందించి వంక సమీపంలో ప్రమాదపు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు, రోడ్డుకిరువైపుల ఏర్పడిన గుంతులను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

వాహనం ఎదురొస్తే అంతే!



సీసీ రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ లేకపోవడంతో వాహనాల ఇక్కట్లు

పాణ్యం: మండల కేంద్రంలో అయ్యపురెడ్డి కాలనీలో చర్చి నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకు నూతనంగా సీసీ రోడ్డు నిర్మించారు. రోడ్డు వేసిన అధికారులు సైడుకు గ్రావెల్ తగినంతగా వేసి చదును చేయడం మరిచారు. దీంతో రెండు వాహనాలు ఎదురుగా వస్తే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నూతనంగా రోడ్డు వేసి నెల రోజులు గడుస్తున్నప్పటికీ అధికారులు సైడ్‌కు గ్రావెల్ వేయకుండా వదిలేశారు. రోడ్డుకు ఇరువైపులా దాదాపు అడుగు మేర లోతు ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక గ్రావెల్ లేని కారణంగా ఆసుపత్రికి వచ్చే ద్విచక్ర వాహనదారులు రోడ్డుపైనే బైకులను నిలుపుతున్నారు. దీంతో ఆస్పత్రికి వచ్చేవారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నూతనంగా నిర్మించిన రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ వేయాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

సబ్సిడీ విత్తనాలు, ఎరువులు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): రైతులకు 90 శాతం సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జిల్లా సహాయ కార్యదర్శి దంబోళ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా రైతులకు విత్తనాలు, ఎరువులను అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అన్నదాత సుఖీభవను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చాలా బ్యాంకులు రైతులకు క్రాప్‌లోన్‌లు ఇవ్వడం లేదని, దీంతో చాలా మంది రైతులకు సరైన రుణాలు రావడం లేదన్నారు. భీసన్న, రబియా, విజయుడు, భీముడు, మునెమ్మ, కోట మ్మ, చాంద్, బుడ్డల బువ్వ మ్మ, జ్యోతి, వీరయ్య పాల్గొన్నారు.

సవరణ

27-05-2025వ తేదీన సాక్షి దినపత్రికలో సదరు స్థిరాస్తికి చెందిన లింకు దస్తావేజు నెం. 3495/2004ను తేది 15-04-2004 అని తప్పుగా ప్రచురితమైనది. దస్తావేజు నెం. 3945/2004ను తేది 15-04-2004 సరియైనదిగా చదువుకోగలరు.

G.S.Vijaya Bhaskar Reddy
B.A.,B.L., Advocate, Kurnool.